క్లుప్తంగా

మెట్టు గోవిందరెడ్డికి పరామర్శ



మెట్టు గోవిందరెడ్డితో వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గం: ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని బెంగళూరులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డిని డీ హీరేహాళ్ మండల కన్వీనర్ రవీంద్రానాథ్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు రహంతుల్లా, పార్టీ సీనియర్ నాయకులు సుదర్శనరెడ్డి, వరకూటి హంపారెడ్డి, బోర్‌వెల్ ఆనందరెడ్డి, మురళీమోహర్‌రెడ్డి, అంజిరెడ్డి బుధవారం పరామర్శించారు. ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మెట్టు పేర్కొన్నారు. ఒకటి రెండు రోజుల్లో రాయదుర్గం వస్తానని ఆయన చెప్పారు. మెట్టు తనయుడు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు విశ్వనాథ్‌రెడ్డితోనూ సమావేశమై పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



మాట్లాడుతున్న జీవీఎస్ఎస్ నాయకులు

రాయదుర్గంటౌన్: సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ నాయక్, రాయదుర్గం అధ్యక్షుడు సభావత్ హరినాయక్ డిమాండ్ చేశారు. బుధవారం వారు రాయదుర్గంలో మాట్లాడుతూ హత్యాచారానికి గురైన సుగాలి ప్రీతి కుటుంబానికి తగిన న్యాయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మోదీ పర్యటనను అడ్డుకుంటామన్నారు.

'రాష్ట్రానికి అన్యాయం చేసిన మోదీ గోబ్యాక్'



రాయదుర్గంలో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

రాయదుర్గంటౌన్: రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన మోదీ గో బ్యాక్ అంటూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రాయదుర్గంలో నిరసన తెలిపారు. వినాయక సర్కిల్‌లో మోదీ పర్యటనను నిరసిస్తూ నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున మాట్లాడుతూ వ్యక్తిగత పొగడ్తలను పక్కనబెట్టి పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు నిధుల విడుదలపై మోదీతో చర్చించి సాధించుకోవాలని హితవు పలికారు. విభజన హామీలు అమలు చేయకుండా ఏ మొహం పెట్టుకుని పర్యటనకు వస్తున్నారని మోదీని నిలదీశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, మధు, తిమ్మరాజు, అంజి, రమేష్, శంకర్, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన కొల్లాపురమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి గంగపూజ చేసి కలశ హారతులతో మహిళలు, చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం చేశారు. ఆలయంలో రెండు రోజుల పాటు హోమాలు, ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరుగుతాయని భక్త మండలి సభ్యులు తెలిపారు.

రేపటి నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

కణేకల్లు: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ మైదానంలో ఈ నెల 17, 18 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓలు లక్ష్మణ్ణ, భవానీశంకర్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో బుధవారం పీడీ, పీఈటీలతో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓలు మాట్లాడారు. స్కూల్‌గేమ్స్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. మండలస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ పీడీ రమేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

- ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు
- అనారోగ్యంగా ఉన్న జీవాలను వధిస్తున్న వైనం
- ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచి మాంసం, చేపల అమ్మకాలు





రాయదుర్గం : మాంసం విక్రయదారులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. అనారోగ్యంతో ఉన్న జీవాలను వధించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నాసిరకం మాంసాన్ని అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. మాంసంతో పాటు చేపల విక్రయాల్లోనూ నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. మాంస ప్రియులకు ఆది, మంగళ, శుక్రవారాల్లో మటన్, చికెన్, ఫిష్ ముక్కలేనిదే ముద్ద దిగదు. కొందరు వారంతో పని లేకుండా మాంసాహారం భుజిస్తారు. మాంసం విక్రయాలకు భారీగా డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో రాయదుర్గంలో కొందరు వ్యాపారులు డబ్బు కోసం కక్కుర్తిపడి నాణ్యతలేని మాంసం విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మున్సిపల్ ప్రజారోగ్య విభాగపు అధికారులు, వెటర్నరీ విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా తనిఖీలకు తిలోదకాలిచ్చారు. ఇంకేముంది నాసిరకం, నాణ్యత లోపించిన మాంసం విక్రయాలు జోరుగు సాగుతున్నాయి. పట్టణంలో దాదాపు 60 చికెన్ సెంటర్లు, 22 మటన్ విక్రయశాలలు ఉన్నాయి. ప్రస్తుతం కిలో మటన్ నాణ్యత ఆధారంగా రూ.600 నుంచి రూ.750 వరకు, కిలో చికెన్ రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. అయితే చాలామంది అపరిశుభ్ర వాతావరణం నడుమ ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు సాగిస్తున్నారు. చేపల అమ్మకాల పరిస్థితి కూడా అలాగే ఉంది. మురుగు కాలువలకు ఆనుకుని రోడ్లమీదే విక్రయిస్తున్నారు. చర్యలు చేపట్టాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన..

అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే మాంసం విక్రయించాలి. పశువైద్యాధికారి ధ్రువీకరించిన తర్వాతే జంతు వధ చేయాలి. జంతువు ఆరోగ్యంగా ఉందా.. బతికి ఉండగానే వధించారా లేదా అనేదాన్ని వెటర్నరీ అధికారి నిర్ధారించాలి. కానీ ఎక్కడ ఈ నిబంధనలు కనిపించడం లేదు. మాంసం కొనుగోలు చేసే సమయాన తాజాదనాన్ని గుర్తించాలి. చాలాచోట్ల మిగులు మాంసాన్ని, చేపలను ఫ్రిజ్‌లలో ఉంచి మరుసటి రోజు అమ్ముతున్నట్లు తెలుస్తోంది.

నాణ్యత.. శుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

రాయదుర్గం పట్టణంలో మాంసం విక్రయ కేంద్రాలపై నిఘా పెంచుతాం. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వాటికి నోటీసులు జారీ చేస్తాం. అపరిశుభ్ర ప్రాంతాల్లో విక్రయిస్తే చర్యలు చేపడతాం. ప్రజలు కూడా మాంసం కొనేముందు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఏదైనా అనుమానం వస్తే సిబ్బంది దృష్టికి తీసుకురావాలి. నాణ్యతలేని మాంసం విక్రయిస్తే కేసులు నమోదు చేయిస్తాం. ప్రజారోగ్యంతో చెలగాట మాడితే తగిన బుద్ధి చెప్తాం. నాణ్యమైన మాంసం మాత్రమే మార్కెట్లో కనిపించాలి. తనిఖీల్లో నాణ్యత లేదని తేలితే దుకాణం సీజ్ చేయిస్తాం.

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

నకిలీ మద్యం పాపం ప్రభుత్వానిదే



ఎక్సైజ్ సీఐ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

- ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల ధర్నా
- నకిలీ మద్యంపై సీబీఐతో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్

ఉరవకొండ: రాష్ట్రంలో నకిలీ మద్యం పాపం కూటమి ప్రభుత్వానిదేనని, నకిలీ మద్యంతో మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై ఉరవకొండ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, పీఏసీ సభ్యులు వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం భారీ ర్యాలీగా ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ ఈడిగప్రసాద్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏసీ ఎర్రిస్వామి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం నేత బసవరాజు, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ బోయ సుశీలమ్మ మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు సొంత జిల్లాలో భారీ స్థాయిలో కల్తీ మద్యాన్ని అధికారులు పట్టుకున్నారని గుర్తు చేశారు. ఇది తెలియని అమాయక ప్రజలు కల్తీ మద్యం తాగి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. నకిలీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

బెల్టుషాపులు ఎత్తేయాలి..

కూటమి ప్రభుత్వంలో ప్రతి వీధిలో వెలసిన బెల్టుషాపులతో పాటు వైన్‌షాపుల పక్కన ఏర్పాటు చేసిన పర్మిట్ రూంలను ఎత్తేయాలని నాయకులు డిమాండ్ చేశారు. బెల్టుషాపులతో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, అతిగా మద్యం సేవించి ఎన్నో రోడ్డు ప్రమాదాలతో పాటు మరెన్నో ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో క్రైం రేట్ భారీగా పెరిగిందన్నారు. నకిలీ మద్యం గుట్టు తేల్చేందుకు ప్రభుత్వం తన జేబు సంస్థ సిట్‌తో విచారణ చేయించకుండా నిష్పక్షపాతంగా సీబీఐ చేత విచారణ జరిపించి ఇందులో తాగి ఉన్న పెద్ద తలలను గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ రవిచంద్రకు నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, పార్టీ రూరల్ సమన్వయకర్త ఎర్రిస్వామిరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కొడికి గోవిందు, ఈశ్వర్, ప్రకాష్, సర్పంచ్ జగదీష్, కోలేగుండ్ల శేఖర్, వడ్డే ఆంజనేయులు, హనమంతు, రాయల్ మల్లి, కమ్మటిరామాంజినేయులు, జేసీబీ రామకృష్ణ, మహానంది, గంధోడి మారేష్, మహిళా నేతలు ఓబుళమ్మ, కొకుంట్ల వసంతమ్మ, లాలు, మైనార్టీ నేతలు శర్మాస్, బాషా, బెలగల్ షమ్ము, బషీర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

రాయదుర్గంటౌన్: రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. కేపీ దొడ్డికి చెందిన వెంకటేశులు బుధవారం పనిమీద రాయదుర్గం వచ్చాడు. పని చూసుకుని తిరిగి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బీడీపీ రోడ్డు బైపాస్ అండర్ బ్రిడ్జి వద్ద 74 ఉడేగోళం వైపు నుంచి వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో వెంకటేశులుకు తీవ్ర గాయాలయ్యాయి. ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి ..

కూడేరు: కమ్మూరు గ్రామం వద్ద బుధవారం అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై వెళుతున్న గుజిరీ ఆటో అదుపు తప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో అనంతపురం పట్టణానికి చెందిన గుజిరీ వ్యాపారులు ఇమాంసేన్, మహమ్మద్ గౌస్ గాయపడ్డారు. గుజిరీ వ్యాపారం చేసుకొని తిరిగి వెళుతుండగా ఘటన చోటు చేసుకుంది.

పద్ధతి మార్చుకోండి

- కేజీబీవీ సిబ్బందితో ఆర్డీఓ వసంతబాబు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని కేజీబీవీలో పనిచేస్తున్న సిబ్బంది పద్ధతి మార్చుకోవాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. బుధవారం బ్రహ్మసముద్రంలోని పాఠశాలను ఆర్డీఓ వసంతబాబు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ నెల 11న పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జి. చందన మృతి ఘటనపై వివరాలను పాఠశాల ఎస్ఓ మహాలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో తరగతి , వంట గదులను పరిశీలించారు. అనంతరం ఆయన నేరుగా పాఠశాలలో వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలన్నారు. విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలలో పనిచేసే సిబ్బంది పద్ధతులు మార్చుకోవాలని, పాఠశాలలో మరోసారి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి క్రీడా ప్రాంగణం



క్రీడా ప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: హనిమిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం గ్రామానికి చెందిన దాత సహకారంతో అందుబాటులోకి వచ్చింది. బుధవారం గ్రామానికి చెందిన వయ్యాలప్ప సుమారు రూ.15 వేలు వెచ్చించి క్రీడా ప్రాంగణంలో పెరిగిన మొక్కలను తొలగించి ట్రాక్టర్‌తో చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం శ్రీనివాసమూర్తి, పాఠశాల కమిటీ చైర్మన్ నాగరాజు, ఉపాధ్యాయులు అర్జున్, రమేష్, మధు దాతను అభినందించారు.

వేరుశనగ పంటకోత ప్రయోగాలు

వజ్రకరూరు: పందికుంటలో బుధవారం వేరుశనగ పంట కోత ప్రయోగం చేపట్టారు. రైతు సుంకమ్మ పొలంలో 6.130 కిలోలు, రైతు మహేష్ పొలంలో 6.700 కిలోల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రయోగాలను డీఏఓ ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. వేరుశనగలో ఈ ఏడాది సాధారణంగా కంటే దిగుబడులు తక్కువగా ఉన్నాయని ఆమె తెలిపారు. అనంతరం స్థానిక వ్యవసాయ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. ఏఓ మధుకర్, ఏఈఓ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న డీఏఓ

బెంగళూరు–విజయపురకు దీపావళి స్పెషల్ ఎక్స్‌ప్రెస్

రాయదుర్గంటౌన్: దీపావళి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి విజయపురకు రాయదుర్గం మీదుగా రానుపోనూ ప్రత్యేక సింగిల్ స్పెషల్ రైలు సర్వీసును ఈ నెల 17, 22 తేదీల్లో నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 17న (శుక్రవారం) రాత్రి పది గంటలకు ఎస్ఎంవీటీ బెంగళూరులో (రైలు నెంబర్ 06245) బయల్దేరి టుమకూరు, అర్సికెర, చిక్‌జాజూర్, చిత్రదుర్గం, రాయదుర్గం , బళ్లారి కంటోన్మెంట్, హొస్పేట, కొప్పల్, గదగ్, బాదామి, బాగల్‌కోట్, ఆల్మట్టి మీదుగా విజయపురకు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 22న (బుధవారం) రాత్రి 7 గంటలకు విజయపురలో రైలు (నంబర్ 06246) బయల్దేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదుగా 23వ తేదీ ఉదయం 11.15 గంటలకు ఎస్ఎంవీటీ బెంగళూరుకు చేరుకుంటుంది. బెంగళూరు నుంచి బయల్దేరే రైలు రాయదుర్గానికి 18న తెల్లవారు జామున 4.30గంటలకు, విజయపుర నుంచి బయల్దేరే రైలు 22న అర్ధరాత్రి దాటిన తర్వాత 2.28 గంటలకు చేరుకుంటుంది.

బిందు సేద్యం ప్రాజెక్టును పూర్తి చేయాలి



డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని కేజీబీవీలో పని చేస్తున్న సిబ్బంది పద్ధతి మార్చుకోవాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. బుధవారం బ్రహ్మసముద్రంలోని పాఠశాలను ఆర్డీఓ వసంతబాబు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ నెల 11న పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జి. చందన మృతి ఘటనపై వివరాలను పాఠశాల ఎస్ఓ మహాలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో తరగతి , వంట గదులను పరిశీలించారు. అనంతరం ఆయన నేరుగా పాఠశాలలో వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందించాలన్నారు. విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలలో పనిచేసే సిబ్బంది పద్ధతులు మార్చుకోవాలని, పాఠశాలలో మరోసారి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో స్తంభించిన వైద్య సేవలు



పీహెచ్‌సీలో వైద్యం కోసం క్యూ కట్టిన రోగులు

కూడేరు: స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు లేక వైద్య సేవలు స్తంభించి గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోగులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు తమ న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత 20 రోజులుగా సమ్మె బాట పట్టారు. కానీ కూటమి ప్రభుత్వం వైద్యుల సమస్యల పట్ల స్పందించ లేదు. ఫలితంగా పీహెచ్‌సీలో రోగులకు వైద్య సేవలందక అవస్థలు పడుతున్నారు. కూడేరు పీహెచ్‌సీకి బుధవారం గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు దగ్గుతూ, ఒళ్ళు నొప్పులుతో మూల్గుతూ, జ్వరం, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధ పడుతూ పెద్ద ఎత్తున తరలి వచ్చారు. వైద్యం కోసం క్యూ కట్టారు. కానీ వైద్యులు లేక వైద్య సేవలు స్తంభించాయి. ఈ పీహెచ్‌సీ పరిధిలో 28 గ్రామాలు, సుమారు 43 వేలకు పైగా జనాభా ఉంది. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వారు ఈ పీహెచ్‌సీకే వస్తారు. కానీ వైద్యులు లేక నాణ్యమైన వైద్య సేవలందక రోగులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

ఘనంగా ఆవుల జాతర

బెళుగుప్ప: రామసాగరం గ్రామంలో బుధవారం ఘనంగా ఆవుల జాతరను యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను గ్రామ సమీపంలోని ఆవుల జాతర కట్టకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆవులు, గొర్రెలు, మేకలతో కట్ట చుట్టూ ప్రదక్షిణాలను చేయించారు. తదనంతరం గ్రామంలో ఎల్లమ్మ ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం చేపట్టారు.

వైద్య విద్యపై చంద్రబాబు కుట్ర



యాటకల్లులో సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శెట్టూరు: వైద్య విద్యపై సీఎం చంద్రబాబు కుట్రతో వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్మెఎస్ రాయుడు, ఎంపీపీ సోమనాథరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోన ఐదుకల్లు, యాటకల్లు, చిన్నంపల్లి, బచ్చేహళ్లి గ్రామాల్లో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పేదలు ఉన్నత స్థాయికి ఎదగడం చంద్రబాబుకు గిట్టదన్నారు. కుంటి సాకులతో పేదలను వైద్య విద్యకు దూరం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు విరుపాక్షి, ఈరన్న, ప్రకాష్, ఎంపీటీసీ సభ్యులు ఎర్రిస్వామి, నరసింహులు, నగేష్, పార్టీ అనుబంధ సంఘం నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, గిరి ప్రసాద్, నాయకులు శ్రీనివాసులు, రాయుడు, సత్యనారాయణ, పాండురంగ, మర్రిస్వామి, మైలారప్ప, లక్ష్మణమూర్తి, లింగప్ప, తిమ్మారెడ్డి, మహేష్, రాము, కిష్టప్ప, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నకిలీ మద్యం అమ్మితే కఠిన చర్యలు

ఉరవకొండ: నకిలీ మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. బుధవారం ఆయన ఈఎస్ రామమోహన్‌రెడ్డి, ఏఈఎస్ శ్రీరామ్‌తో కలిసి పట్టణంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్ ద్వారానే మద్యం విక్రయాలు చేపట్టాలన్నారు.

19న వైఎస్సార్‌సీపీ సమావేశానికి తరలిరండి

విడపనకల్లు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణపై ఈనెల 19న ఉరవకొండ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగే సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ కురుబ రమేష్ కోరారు.

చేతుల శుభ్రతతో రోగాలు దూరం

శెట్టూరు: చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సగం రోగాలకు దూరంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. బుధవారం మండలంలోని విద్యానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే నిర్వహించారు.

వజ్రకరూరు: చాబాల ప్రాథమిక పాఠశాల, వజ్రకరూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు. సర్పంచులు మల్లెల జగదీష్, మోనాలిసా చేతుల శుభ్రత ప్రాముఖ్యతను వివరించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

కణేకల్లు: తల్లి పాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. కణేకలు అంగన్‌వాడీ కేంద్రం–8లో బుధవారం పోషణ మాసోత్సవాల సందర్భంగా గర్భిణులు, తల్లులకు సీడీపీఓ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా రైతుల శక్తికి పూర్తి మద్దతు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం మహిళా రైతు ఉత్పత్తిదారులు సహకార సంఘం సమావేశం ఏపీఎం గంగన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మీ శక్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా మద్దతు ఇస్తుందని తెలిపారు.

పాల్తూరులో వైద్య శిబిరం

విడపనకల్లు: పాల్తూరు ఎస్సీకాలనీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ త్యాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ యశోదమ్మ, సుధాకర్ ఏఎన్ఎం శ్రావణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో కూరగాయల వ్యాపారి మృతి

కళ్యాణదుర్గం: పట్టణానికి చెందిన కూరగాయల మండి వ్యాపారి టీకేబీ దాదాఖలందర్ (52) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు .. దాదాఖలందర్ పట్టణంలోనే కూరగాయల మండీ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే వ్యాపారంలో ఆర్థిక ఒడిదొడుకులు కారణంగా కొద్దిరోజులుగా మానసికంగా కృంగిపోయారన్నారు. ఈ క్రమంలోనే గుండెపోటుతో చనిపోయారన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శెట్టూరు: మండలంలోని చెర్లోపల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (44) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 21న చెర్లోపల్లికి బైక్‌పై వెళ్తుండగా గేదె అడ్డురావడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. అయితే అప్పటి నుంచి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం పరిస్థితి విషమించడంతో చనిపోయాడన్నారు.

ఉద్యాన పంటల సాగుపై శిక్షణ

బెళుగుప్ప: మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ అధ్యక్షతన బుధవారం కళ్యాణదుర్గం కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్, ఎకాలజీ విభాగం ఎఫ్‌పీఓ అధికారులు రమేష్, నటరాజులతో కలసి రైతులకు ఉద్యాన పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పంటనష్ట పరిహారం అందించాలి

గుమ్మఘట్ట: ఖరీఫ్‌లో వర్షాధారం కింద వేరుశనగ సాగు చేసి నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నాగార్జున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని 75 వీరాపురం, పూలకుంట, కలుగోడు, వెంకటంపల్లి, రంగచేడు తదితర గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ పంటలను సీపీఐ నాయకులు బుధవారం పరిశీలించారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయదుర్గంటౌన్: కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని రాయదుర్గం బార్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ముందు న్యాయవాదులు నిరసన తెలియజేశారు. ఈ నెల 18 వరకు కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతామని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశప్ప, ఈసీ వన్నూరుస్వామి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు లోకానంద, ఉపాధ్యక్షుడు రవిచంద్ర, సంయుక్త కార్యదర్శి పృథ్వీరాజ్, కోశాధికారి రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు జగన్‌మోహన్‌రెడ్డి, రఘునాయక్, కల్యం నాగరాజు, రేణుక, జాన్సన్, నరసింహరావు పాల్గొన్నారు.

ఘనంగా కలాం జయంతి

కణేకల్లు: యర్రగుంటలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హెచ్ఎం పాటిల్ జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు కలాం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

వజ్రకరూరు: స్థానిక కేవీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ తిమ్మప్ప, హెచ్ఎం స్వర్ణలత, అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత బెంజ్‌మెన్, భారత సేవారత్న జాతీయ అవార్డుగ్రహీత మల్లికార్జున, ఉపాధ్యాయుడు రంగస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.